# తెలుగులో స్త్రీల కథా సాహిత్య ధోరణులు

## విద్యార్థినుల తెలుగు ప్రాజెక్టువర్క్

Enter to Learn, Leave to Serve


పర్యవేక్షకులు

**డా॥ఎమ్. శ్యామల**

తెలుగు శాఖాధ్యక్షులు మరియు అధ్యాపకురాలు

తెలుగు విభాగం

పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి)

వడ్డెపల్లి, హన్మకొండ, తెలంగాణ


<u>సమర్పించువారు</u>

| | | |
|---|---|---|
| 1. ఎమ్. పూజిత | బిఎస్సి (ఎమ్‌పిసిఎస్) | ద్వితీయ సంవత్సరం |
| 2. జి. ప్రమీల | బిఎస్సి (ఎమ్‌పిసిఎస్) | ద్వితీయ సంవత్సరం |
| 3. ఇ. అశ్వితపటేల్ | బిఎస్సి (ఎమ్ఎస్‌టిసిఎస్) | ద్వితీయ సంవత్సరం |
| 4. పి. కీర్తి | బిఎస్సి (ఎమ్‌పిసిఎస్) | ద్వితీయ సంవత్సరం |
| 5. ఎన్. మనీష | బిఎస్సి (ఎమ్‌పిసిఎస్) | ద్వితీయ సంవత్సరం |
| 6. ఎస్.నిఖిత | బిఎస్సి (ఎమ్ఎస్‌టిడిఎస్) | ద్వితీయ సంవత్సరం |

2022-23

# విషయ సూచిక


I. పరిధి – పద్ధతి

II. ఉద్ధేశ్యం

III. ప్రయోజనం

IV. అధ్యాయ విభజన

1. మొదటితరం కథా రచయిత్రులు 1900–1930
2. రెండవతరం కథా రచయిత్రులు 1931–1960
3. మూడవతరం కథా రచయిత్రులు 1961–1990
4. నాలుగవతరం కథా రచయిత్రులు 1991–2020

V. ముగింపు

VI. ఉపయుక్త గ్రంథసూచి

# అంశం: తెలుగులో స్త్రీల కథా సాహిత్య ధోరణులు

## పరిధి–పద్ధతి:

మా ప్రాజెక్టు కోసం మేము గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదివాము. అందులో సం॥1900ల నుండి సం॥2020 వరకు అనగా 120 సంవత్సరాల కాలంలో కథా సాహిత్య రంగంలో స్త్రీలు రాసిన కథల గురించి విమర్శ గ్రంథాలను సేకరించి చదివాము. మార్గదర్శకుల సహాయంతో విశ్లేషణాత్మక పద్ధతిలో ఈ ప్రాజెక్టు చేసాము. రచయిత్రుల కథలను కాలక్రమానుసారంగా అధ్యయనం చేయడం ఈ పరిశోధనకు అనుసరించిన మరొక పద్ధతి.

## ఉద్దేశ్యం:

తొలి తెలుగు కథారచయితగా పేరుపొందిన కవి గురజాడ. కానీ ఆయనకు ముందునుంచే స్త్రీలు కథలు రాసి పత్రికలలో ప్రచురించడం ప్రారంభించారు. ఇప్పటివరకు మనకు లభిస్తున్న సమాచారాన్ని బట్టి తొలి మహిళా కథా రచయిత బండారు అచ్చమాంబ. ఆమె తొలి కథ ప్రేమ పరీక్షణము, సం॥ 1998 జూలై

తెలుగు జనానా పత్రికలో అచ్చయింది. సం॥1910లో దిద్దుబాటు కథ వచ్చేనాటికి బండారు అచ్చమాంబతో కలిపి 14 మంది స్త్రీలు కథలు రాసారు. ఇప్పటి వరకు కథలు రాసిన స్త్రీల సంఖ్య వందల్లో ఉంటే వారు రాసిన కథలు వేలల్లో ఉన్నాయి. ఈ కాలంలో అనగా సం॥1900 నుండి సం॥2020 వరకు అంటే ఈ 120సం॥ల కాలంలో స్త్రీలు రాసిన కథా సాహిత్య ధోరణుల గురించి స్థూలమైన అవగాహన కోసం, సమాజంలో స్త్రీల స్థితిగతులు ఎలా చిత్రీకరించబడ్డాయో గుర్తించి విశ్లేషించడం మా పరిశోధన ముఖ్యోద్దేశం.

## ప్రయోజనం :-

స్త్రీలు స్వతంత్ర వ్యక్తులుగా ఎదగకుండా సాంఘిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులు, పురుషాధిక్యత అవరోధమవుతున్నాయి. పితృస్వామ్య వ్యవస్థ మారకపోవడం వలన స్త్రీలు ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేస్తున్నా కుటుంబం-వివాహం అనే రెండు వ్యవస్థల చేత నియంత్రించబడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల వలన స్త్రీలు తమ జీవన విధానంలో అసంతృప్తికి లోనవుతున్నారు. ఆ అసంతృప్తిని తెలియజేయడానికి రచనలను ఆధారంగా చేసుకున్నారు. ఇలా ఎందరో రచయిత్రులు సమస్యల పట్ల స్పందించి తమ అవగాహన మేరకు వాటికి సమాజంతో ఉన్న సంబంధాన్ని, సామాజిక సమస్యల స్వభావాన్ని చిత్రిస్తూ రచనలు చేసారు. కథలను విశ్లేషణకు పెట్టడం ద్వారా స్త్రీల సాహిత్యపు విలువలను నిర్ధారించడం ఈ పరిశోధన వల్ల సమకూరే ప్రయోజనం.

**అధ్యాయ విభజన :**

1. మొదటితరం కథా రచయిత్రులు 1900-1930
2. రెండవతరం కథా రచయిత్రులు 1931-1960
3. మూడవతరం కథా రచయిత్రులు 1961-1990
4. నాలుగవతరం కథా రచయిత్రులు 1991-2020

## 1. మొదటితరం కథారచయిత్రులు 1900–1930 :

ఆంధ్ర దేశంలో సంస్కరణోద్యమం స్త్రీలు విద్యావంతులు కావటానికి, సంఘాలు పెట్టుకోవడానికి, తోటి స్త్రీలను విద్యార్జనకు ప్రోత్సహించడానికి కారణమైంది. అలా తయారయిన మొదటితరం స్త్రీలలో బండారు అచ్చమాంబ ఒకరు. ఆమె తొలి తెలుగు కథారచయిత్రి కూడా కావటం విశేషం. అచ్చమాంబ రాసిన మొట్టమొదటి కథలు 'ప్రేమ పరీక్షణము' (జులై, 1898), 'ఎఱుపు సొమ్ము పరువుచేటు' (సెప్టెంబరు, 1898) రాయసం వెంకటశివుడు సంపాదకత్వంలో వెలువడిన తెలుగు జనానా పత్రికలో అచ్చయ్యాయి. కాని ఆ పత్రికలు అందుబాటులో లేనందున అదే పత్రికలో 1901 మే నెలలో అచ్చయిన 'గుణవతియగు స్త్రీ' కథను మొట్టమొదటి కథగా పరిగణిస్తున్నారు.[1]

బండారు అచ్చమాంబకు కొనసాగింపుగా మండపాక జోహానమ్మ 1902 జూన్ 1వ తేదీన కథారచన ప్రారంభించి ' రెండు సంచులను గూర్చిన కథ 'రాసింది. విన్నకోట లక్ష్మీ జోగమ్మ 1 జులై, 1902లో 'అవివేకపు వెంకమ్మ' కథతో కథారచనకు శ్రీకారం చుట్టింది. పులుగుర్త లక్ష్మీనరసమాంబ 1902లో కథారచన ప్రారంభించి "సత్కథావల్లరి" పేరుతో స్త్రీలకోసం నీతి బోధకమైన పురాణ కథలను రచించింది. మొసలికంటి రామాబాయమ్మ కూడా అదే తేదీన రచన ప్రారంభించి 'నీలాటి రేవులో

యిద్దరు స్త్రీల సంభాషణ', 'నగలు', 'విమల' వంటి కథలను రాసింది. వడ్లమన్నాటి సుందరమ్మ 'సతీమణీ' కథతో, శ్రీధర సీతాదేవమ్మ 'లోభివాని' కథతో, గంటి జోగమాంబ 'సుగుణవతి–దుర్గుణవతి'కథతో, గుండాల లచ్చుమ్మ 'సతీహితోపదేశము' కథతో 1903లో కథారచనకు శ్రీకారం చుట్టారు. బాలాంత్రపు శేషమ్మ 'ధైర్య స్థైర్యములు' కథ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ 'స్త్రీ విద్యను గురించిన కథ' 1904 నాటివి. ఇదే సంవత్సరం చౌ.శాంతాబాయి, సప్నివీసు లక్ష్మీ నర్సుబాయి చెరో కథను రాశారు. 1904 వరకు '14' మంది స్త్రీలు '25' కథలు రాశారు[2].

1904తర్వాత నుండి 1926వరకు మనకు రచయిత్రుల కథలు లభించడం లేదు. 1926 నుండి విరివిగా వచ్చాయి. దీనిక్కారణం పత్రికారంగం విస్తరించటం. గృహలక్ష్మి పత్రిక స్త్రీల రచనలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇయ్యటం.

1926 ఆగస్టు భారతిలో ఆ భాస్కరమ్మ సంఘసంస్కరణ నేపథ్యంలో రాసిన 'ప్రభావతి కథ'తో మళ్ళీ మనకు స్త్రీల కథలు కనిపిస్తాయి. కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'మీ పాదముల సాక్షిగా' అనే కథ స్త్రీలు మూర్ఖత్వాన్ని విడనాడి చైతన్యవంతులు కావడానికి మహిళాసంఘాలు ఉపకరిస్తాయని చెబుతుంది.

1928 జనవరిలో కథారచన ప్రారంభించిన మరొక రచయిత్రి గుమ్మడిదల దుర్గాబాయి. సంఘసంస్కరణ నేపథ్యంలో 'నేధన్యనైతిని' అనే కథను రాసింది[4].

## 2. రెండవతరం కథారచయిత్రులు 1931–1960 :

సుసర్ల లక్ష్మీనరసమాంబతో రెండవతరం కథా రచయిత్రుల చరిత్ర మొదలైందని చెప్పవచ్చు. ఆమె రాసిన అయిదు కథలు గృహలక్ష్మి పత్రికలో అచ్చయ్యాయి. తొలి దళిత కథారచయిత్రి గొట్టుముక్కల మంగాయమ్మ 1935 మార్చిలో 'అయ్యోపాపం' అన్న కథతో మొదలుపెట్టి చాలా కథల్లో అస్పృశ్యత సమస్య నివారణ జరగాలనే ఆవేదనను, అగ్రకులాల వైఖరిపట్ల నిరసనను తెలిపింది[5].

జానపద మాండలికాల్లో కథలు రాసిన వారిలో డా॥ పాకాల యశోదా రెడ్డి ఒకరు. మొదటికథ 1940–మాతృభారతిలో అచ్చయింది. ఎక్కువగా 1950–60ల మధ్య కథలు రాసింది. తెలంగాణ పల్లెపట్టులో, వాడుకలో ఉన్న చక్కటి నుడికారాన్ని కథల్లో నింపి 'గంగిరేగి చెట్టు', 'మాఊరి ముచ్చట్లు', 'మొమ్మైకృత', 'ఎంకన్న', 'మ్యానరికం', వంటి కథలను రాసింది. శిష్టేతర జానపద పదాలను, వాక్య విన్యాసాలను పుణికి పుచ్చుకొని రచనలో వైవిధ్యం చూపించింది. తెలంగాణా పల్లె జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వీరి కథలుంటాయి. ఆడది పురుషుడికి లొంగి ఉండాలన్న సంప్రదాయాన్ని పరోక్షంగా ఎత్తి చూపిన కథ 'గంగిరేగి చెట్టు'[6].

కె.రామలక్ష్మి 1950ల నుండి కథలు రాయడం ప్రారంభించింది. ఈమె కథల్లోని పార్వతి కృష్ణమూర్తి పాత్రలు ఆనాటి యువతకు విప్లవాత్మకమైనవిగా కనిపించాయి. యాభయ్యవ దశాబ్దపు స్త్రీల ఆదర్శాలకు ప్రతీక అయిన పార్వతి మొండి, పెంకి, చురుకుదనం, ధైర్యం కలిగి తనను తాను సమర్థించుకొని నిలబడే కొత్తరకపు మధ్య తరగతి యువతిగా కనిపిస్తుంది [7].

1950లోనే కథారచన ప్రారంభించిన మరో రచయిత్రి 'మాలతీ చందూర్'. 'రవ్వల దుద్దులు' అనే కథ ఆనందవాణి పత్రికలో ప్రచురితమైంది. 'రాజీవలోచన', 'డాబా ఇల్లు' వంటి కథలు స్త్రీల వైవాహిక గృహజీవిత సమస్యలు, రాజీల గురించిన విషయాలను తెలియజేస్తాయి[8].

అబ్బూరి ఛాయాదేవి తొలికథ 'అనుబంధం' నిజాం కాలేజీ మేగజైన్ 'విద్యార్థి'లో 1952- 53 లో అచ్చయింది[32]. వ్యాపార పత్రికలో ప్రచురింపబడిన తొలికథ 'విమర్శకులు' తెలుగు స్వతంత్రలో 1955లో ప్రచురించబడింది. 'బహిష్టు', 'మూడునాళ్ళ ముచ్చట', 'ఉపగ్రహం', 'శ్రీమతి ఉద్యోగిని, 'గడ్డునెల' వంటి కథల ద్వారా కుటుంబంలో స్త్రీ రెండవ స్థాయి పౌరురాలిగా ఎలా అసంతృప్తిగా జీవిస్తుందో చూపించింది. పునరుత్పత్తి విషయాలను, లైంగిక ధర్మాలను కథాసాహిత్య వస్తువుగా ప్రవేశపెట్టి 'శరీర స్పృహ'ను కలిగించింది. ఆడపిల్ల అత్యాచారానికి గురైనంత మాత్రాన

ఆత్మహత్య  చేసుకోవడం కాదు, దాన్ని దుర్ఘటనగా భావించి మామూలు జీవితం కొనసాగించాలనీ, సహృదయుడైన వ్యక్తి తోడు దొరికితే జీవితంలోనికి అతన్ని ఆహ్వానించాలని సూచిస్తూ 1965లో 'ప్రయాణం' అనే కథను రాసింది. స్టార్ హాస్పటళ్ళ ప్రచార ఆర్భాటాన్ని, వ్యాపారతత్వాన్ని అమాయకుల బలహీనతల మీద ఆడుకునే దుర్మార్గాన్ని దోపిడీని నిరసిస్తూ 'ఆఖరికి అయిదు నక్షత్రాలు' అనే కథను, అట్టహాసమైన  ఆడంబరాలతో జరిగే పెళ్ళిళ్ళను నిరసిస్తూ 'అదొక సంస్కృతి' అనే కథను రాసింది. 1974లో రాసిన 'బోన్‌సాయ్ బ్రతుకు' కథలో ఆడవాళ్ళ జీవితం ఎన్ని కత్తిరింపులకు, కుదింపులకు లోనవుతుందో చూపింది[9].

రెండో తరంలో - స్త్రీల కథను స్త్రీవాద కథగా పరిణమింపచేయడంలో ముఖ్యులు రంగనాయకమ్మ. 1955నుండి కథలు రాయడం మొదలుపెట్టింది. పెళ్ళి విషయంలో స్త్రీలు పెంచుకోవలసిన చైతన్యాన్ని గురించిన అవగాహనతో 1970లో 'అనితర సాధ్యుడు' అనే కథను రాసింది. భార్యాభర్తలు వంటింటికోసం, చిల్లరపనుల కోసం కాక ప్రేమకోసం బతకాలన్న జీవితసత్యాన్ని చెబుతూ 1971 లో ' పెళ్ళానికి - ప్రేమ లేఖ' అనే కథను రాసింది. 'అమ్మ' అనే కథలో పెంపకంలో ప్రధాన పాత్ర తల్లిది కనుక ఆమె ఆడపిల్లలను ఎలా తయారుచేస్తుందో తెలియజేస్తుంది రచయిత్రి.

సమాజమార్పు భార్యాభర్తల మధ్య ఎలాంటి అడ్డుగోడలను నిర్మిస్తుందో చర్చకు పెడుతూ 'మురళీ వాళ్ళమ్మ' అనే కథను రాసింది. 1996లో రాసిన 'అమ్మకు ఆదివారం లేదా?' అనే కథలో సమకాలీన అంశాల పట్ల స్పందించి స్త్రీల చైతన్యాన్ని తెలియజేసింది[10].

తెలంగాణా కథకుల్లో పేరు తెచ్చుకున్న వారిలో ఇల్లిందల సరస్వతి దేవి ఒకరు. స్వర్ణకమలాలు, తులసీదళాలు వంటి కథా సంపుటాలను వెలువరించింది. 'కొండమల్లెలు' కథానిక ద్వారా దళిత జీవితాన్ని కూడా స్పృశించింది[11].

## 3. మూడవతరం కథారచయిత్రులు 1961-1990 :

మూడవ తరం 1962 నుండి కథలు రాయడం ప్రారంభించిన డి. కామేశ్వరితో మొదలవుతుంది సమకాలీన, సాంఘిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు ప్రతిఫలించేలా 'వానచినుకులు', 'తల్లిమనసు', 'కన్నీటికి విలువెంత?', 'ఆరని బ్రతుకులు', వంటి '250' కథలు రాసింది. 1962-75 మధ్య విపరీతంగా కథలు రాసింది[12]

మల్లాది సుబ్బమ్మ 1962లో 'మంట కలిసిన మానవత్వం' కథతో కథారచనకు శ్రీకారం చుట్టింది. పురుషుల దౌష్ట్యం మీద స్త్రీల నిస్సహాయత గురించి 'మాతృత్వానికి మరోముడి' వంటి కథలు రాసింది. "మహిళా విముక్తిలోనే పురుష వ్యక్తిత్వ వికాసం ఇమిడి వుంది" అని ఆ లక్ష్యంతో స్త్రీ పురుషులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమానత్వ ప్రాతిపదికపై కావాలని విప్లవాత్మక సాహిత్యాన్ని కథలుగా రచించింది[13]..

వైవాహిక జీవితంలోని స్త్రీ పురుషసంబంధాలను విభిన్న కోణాల నుండి చర్చకు పెడుతూ పి.సత్యవతి అనేక కథలు రాసింది. 1964లో 'ఆదివారంకోసం' అన్న కథతో సత్యవతి కథా సాహిత్య ప్రస్థానం ప్రారంభమయింది. 1974లో రాసిన'భూపాలరాగం' కథలో పేద మధ్య ధనిక వర్గపు స్త్రీల గృహజీవన శైలిని చిత్రించింది. 1978లో 'మాఘ సూర్యకాంతి' కథరాసి స్త్రీల జీవితంలో కనిపించని హింసను, పోలీసింగ్‌ను గుర్తించి చూపడమే కాక ప్రతిఘటించి నిలిచే స్త్రీల చైతన్యాన్ని

కూడా నిరూపించింది.స్త్రీ తన అస్థిత్వాన్ని గురించి తెలుసుకునే క్రమంలో రాసిన కథ 'ఇల్లలకగానే పండుగేనా' – ఈ కథ స్త్రీవాద సాహిత్యానికి తలమానికం వంటిది. 'సూపర్ మామ్ సింద్రోమ్' కథ స్త్రీలు ఇంటిచాకిరీలో పడి పరాయికరింపబడటమే కాకుండా కుటుంబాల కోసం చివరకు శరీరాలను కూడా సమర్పిస్తున్న విధానాన్ని, స్త్రీ గృహిణిగా, ఉద్యోగిగా రెండు వైపులా నలిగిపోతున్న తీరును తెలియజేస్తుంది. 'మంత్రనగరి' కథ ప్రపంచీకరణ, సంస్కృతి స్వభావం స్త్రీల అభివృద్ధిని అడ్డుకుంటున్న విధానాన్ని చెబితే, 'పతిభక్తి' కథ పితృస్వామిక సంస్కృతిని మతం అన్ని వర్గాల స్త్రీల మీద ఏ మినహాయింపు లేకుండా ఎలా రుద్దుతుందో తెలియజేస్తుంది.[14]

నల్లూరి రుక్మిణి 1975 ఎమర్జెన్సీ సంఘటన ఆధారంగా 'గృహమే కదా స్వర్గ సీమ' కథను రాసింది.

స్త్రీల అస్తిత్వ ఆరాటాన్ని స్త్రీల నాయకత్వశక్తిని సమాంతర ప్రజా ఉద్యమాలను నీరు గార్చడానికి ఉపయోగిస్తున్న తీరును ఒక స్త్రీ అనుభవకోణం నుండి చెప్పిన కథ 'పడగ'. పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయవ్యవస్థ 'విమెన్– ఫ్రెండ్లీ' కాదన్న విషయాన్ని ' గెలవని ఆట' కథలో నిరూపించింది రచయిత్రి. వస్తు వినిమయ సంస్కృతి స్త్రీల జీవితాన్ని విధ్వంసం చేస్తున్న విధానాన్ని 'మృత్యుస్పర్శ' కథలో చిత్రించింది[15].

డా॥ సి. మృణాళిని 1976లో 'నిర్ణయం' కథతో కథారచన ప్రారంభించింది. అస్థిత్వస్పృహతో జీవించే ఆధునిక స్త్రీ జీవితాన్ని గురించి 'కోమలి గాంధారం' కాలంకథలు రాసింది.

1980 తర్వాత స్త్రీవాద దృక్పథం నుండి తెలుగు కథ వికసించింది. తెలుగులో స్త్రీల కథ తాత్విక అర్థంలో స్త్రీవాద కథగా రూపాంతరం చెందటం కనిపిస్తుంది. వైవాహిక జీవితంలోని స్త్రీ పురుష సంబంధాలను విభిన్నకోణాల నుండి చర్చకు పెడుతూ రచయిత్రులు అనేక కథలు రాసారు. స్త్రీ శరీరాన్ని స్త్రీది కాకుండా చేసిన అధికార లైంగిక రాజకీయాల బండారాన్ని బయట పెడుతూ ఓల్గా 'రాజకీయకథలు' రాసింది. ఉద్యోగం చేస్తున్నా ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్త్రీల గురించి 'వెలుతురులోకి', 'ప్రయోగం' వంటి కథలను రాసింది. స్త్రీ నిర్ణయం పై కుటుంబ అధికారాల అణచివేతను, సంస్కృతీ స్వభావాన్ని చిత్రించిన కథ 'భిన్న సందర్భాలు'. ఏడేళ్ళ పసి బాలికను అత్యాచారానికి గురిచేసి కామ విషయానికి సంబంధించిన యంత్రంగా మార్చిన ఉదంతం ఓల్గా రాసిన 'అయోని' కథకు కేంద్రబిందువు. దానిలో ఆ పాప "నేను యోని లేకుండా పుడితే బాగుండును కదా?" అని అనుకుంటుంది[16].

కుప్పిలి పద్మ ప్రపంచీకరణ దుష్పరిణామాల గురించి 'కుబుసం', 'సాలభంజిక', 'ఇన్‌స్టంట్ లైఫ్', 'ప్రకంపనం', 'కొత్తచూపు' వంటి కథలు రాసింది. స్త్రీలు చేస్తున్న వెట్టిచాకిరి ఎలా పనికి రాకుండా పోతుందో సమాజ వాస్తవాన్ని తెలుపుతూ 'మసిగుడ్డ',

‘మమత’, ‘మూడు నిమిషాలు’ వంటి కథలు రాసింది. వివాహచట్టంలో ఒదగకుండా ఒంటరిగా జీవించగలిగే నిర్ణయాన్ని తీసుకున్న స్త్రీల పరిస్థితుల గురించి ‘కేసు’, ‘ఇల్లీగల్’, ‘నిర్ణయం’, ‘వల’, ‘ముక్త’ , ‘పాత బంగారులోకం’ కథల్లో చెప్పింది. యోని సంబంధమైన ఇన్‌ఫెక్షన్‌ల గురించి స్త్రీలు సతమతమవుతున్న పరిస్థితిని వివరిస్తూ ‘ఎ.డి.ఆర్.ఎల్.’ వంటి కథలను రాసింది[17].

### 4. నాలుగవతరం కథారచయిత్రులు 1991-2020 :

మహిళల జీవితాల్లోని వేదనను, అశాంతిని, పీడనను చిత్రిస్తూ 1990ల తర్వాత అనేక కథలు వచ్చాయి. ఇవి పురుషాధిక్యతను నిరసిస్తూ అణచివేతపై తిరస్కారం చూపుతూ స్త్రీ స్వేచ్ఛను, వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరించాయి. కొండెపూడి నిర్మల రాసిన 'మొద్దురాచ్చిప్ప' , 'ఎద్దుపుండు', 'జరీ అంచు తెల్లచీర' వంటి కథలు సంతోషంగా శృంగారానుభవాన్ని పొందే అవకాశం స్త్రీలకు నిరాకరింపబడుతున్న విషయాన్ని నిరసన స్వరంతో పలికాయి. ఇల్లు విడిచి బయటి ప్రపంచంలోనికి వచ్చి తనకు నచ్చిన విధంగా జీవించాలనుకునే స్త్రీకి అడుగడుగునా ఎదురయ్యే అవరోధాలను గురించి 'ఖండిత', 'కంకాళం' వంటి కథలను రాసింది[18].

ముదిగంటి సుజాతారెడ్డి 1994 నుండి కథలు రాయడం మొదలుపెట్టి విసుర్రాయి, మింగుతున్న పట్నం, వ్యాపార మృగం వంటి కథా సంపుటాలను అచ్చువేసింది. వ్యాపారసంస్కృతి వ్యవసాయ, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాలపై ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తుందో తెలుపుతూ 'మింగుతున్న పట్నం' కథాసంపుటిని రాసింది. దీనిలోని కథలు కరువు నేపథ్యంగా సాగుతూ దోపిడీ, దౌర్జన్యం, పీడనకు సంబంధించినవి[19].

దళిత స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షను గురించి ప్రత్యేకంగా దళిత స్త్రీవాద సాహిత్యం బయలుదేరింది. జూపాక సుభద్ర దళిత అస్తిత్వ స్త్రీవాద చైతన్యంతో

కథలు రాసింది. దక్కలి స్త్రీ అనుభవాన్ని చొరవను ఆవిష్కరించి 'మాన్యం' కథ రాసింది. దళిత స్త్రీ కోణం నుండి 'శుద్ధి చెయ్యాలె', 'ఆదర్శ విధ్వంసం' వంటి కథలను రాసింది.

జాజుల గౌరి దళిత కుటుంబ జీవనచిత్రణ చేస్తూనే అందులోనూ ఆడపిల్లలకు,మగపిల్లలకు మధ్య ఉండే వ్యత్యాసాలను గురించి 'నీళ్ళ బాయి' కథను రాసింది. దళిత అస్థిత్వ చైతన్యం నుండి 'నేన్ నేన్ లెక్కనే', 'మన్నుబువ్వ' వంటి కథలు రాసింది. చల్లపల్లి స్వరూపరాణి రాసిన 'భద్రం తల్లీ', 'ముసుగు', 'మా చిన్నత్త' మొదలైన కథలు పేదరికం, కుల వివక్ష, లింగ వివక్ష-మూడు వైపుల దాడికి గురవుతున్న స్త్రీల జీవనవేదనలను చిత్రించాయి. వినోదిని దళిత అస్థిత్వస్పృహ నుండి 'బ్లాక్', 'బ్లాక్ ఇంక్', 'బాలేదు జరమొచ్చింది' కథలను, గోగు శ్యామల 'రడం', 'ఊరజెర్వు' వంటి కథలను దళిత స్త్రీవాద నేపథ్యంలో రాసారు[20].

గీతాంజలి 1995-2000ల మధ్య గ్లోబలైజేషన్ నేపథ్యంగా 'ఊరికిపోదాం భూదేవి' కథ రాసింది. ముస్లింస్త్రీల జీవితాన్ని, బాధలను సమస్త స్త్రీజాతి సమస్యల వలెనే అర్థం చేసుకుంటూ వాటిలోని ప్రత్యేకతలను గుర్తిస్తూ విశ్లేషిస్తూ 'బచ్చేదాని', 'పహెచాన్' కథా సంపుటాలను వెలువరించింది. ప్రత్యేక ఆర్థిక మండలి (S.E.Z.) నేపథ్యంతో 'నేను పోలెపల్లి పీనుగని మాట్లాడుతున్న', 'ఆఖరి వడ్లగింజలు' వంటి

కథలను విప్లవ దృక్పథంతో రాసింది. శ్రామిక స్త్రీ పక్షపాత చైతన్యాన్ని ప్రదర్శించి 'యాడి', 'సంటిది' వంటి కథలను రాసింది.

ముస్లిం మైనారిటీ స్త్రీల జీవితాంశాలను వస్తువులుగా చేసుకొని షాజహానా, షహనాజ్, యాస్మిన్ బేగం, రుబేనా పర్వీన్ మొదలైనవారు కథలు రాశారు. షాజహానా రాసిన 'సిల్ సిలా' కథ ముస్లింసమాజంలో దూదేకులు ఎదుర్కొనే వివక్షను, స్త్రీలపై పడే పేదరికపు బరువును, భర్తల అధికార దౌష్ట్యాలను చిత్రించింది. ప్రాథమిక అవసరాలు కూడా ప్రాణాంతక సమస్యలుగా మారుతుంటే స్త్రీలు పడే అవస్థను 'సండాస్' కథలో చిత్రించింది.

తెలంగాణలో విప్లవోద్యమ నేపథ్యం నుండి కథలు రాసిన మహిళా రచయిత్రి యం.రత్నమాల. లక్ష్మి – తెలంగాణ విప్లవోద్యమ సందర్భాలతో, సంఘటనలతో 'కామ్రేడ్ కైరి గంగారాం చిరునామా', 'గమ్యం–చేరేదాకా పరుగు పందెం' వంటి కథలను రాసింది. షహీదా, భారతి, కరుణ, మిడ్కో, పి.వరలక్ష్మి, నిత్యవంటివారు చైతన్యవంతమైన కథలు వ్రాసారు.

## ముగింపు:

తొలుత స్త్రీలు సంఘ సంస్కరణ నేపథ్యంతో కథలు వ్రాసారు. స్వాతంత్ర్యానంతరం రచయిత్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. సాంప్రదాయ వారసత్వానికి క్షణక్షణం పరివర్తన పొందుతున్న నూతన సమాజానికి సంఘర్షన జరుగుతున్న కాలంలో రెండింటిని సమన్వయపరుస్తూ కథను వ్రాసారు. స్త్రీ తనని గూర్చి తాను తెలుసుకుంటూ చైతన్యం పొంది కుటుంబంలో, వైవాహిక జీవితంలో, స్త్రీ పురుష సంభంధాలను వివిధ కోణాల నుండి చర్చకు పెడుతూ రచయిత్రులు కథలు వ్రాసారు.

సం॥1980 నుండి స్త్రీవాద కథలు వచ్చాయి. అవి క్రమంగా దళిత స్త్రీ వాదం, మైనారిటీ స్త్రీ వాదం, గిరిజన స్త్రీ వాదం, విప్లవ స్త్రీవాదాలుగా పరిణమించిన విధానాన్ని , ప్రాంతీయ అస్థిత్వాన్ని గురించి రచయిత్రులు కథలు రాసారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణల ప్రభావం స్త్రీలపై ఎలా పడుతుందో ప్రచార, ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం యువతపై ముఖ్యంగా యువతులపై చూపిస్తున్న ప్రభావాలను, వస్తు వ్యామోహాలను, మానవ సంబంధాలు నశిస్తున్న విధానాలను, ప్రేమ పేరుతో వేదింపులను జరిగే సంఘటనలను ప్రతిఫలించేలా కథలు వ్రాసారు.

స్త్రీలు ఇంటా, బయటా ఉద్యోగం చేస్తున్న చోట లైంగిక దోపిడికి గురవుతున్న సంఘటనలను, ఆర్థిక స్వాతంత్య్రంలేని స్త్రీల కథలను వ్రాసారు.

సరోగసీ, విదేశీ జీవితం పట్ల ఉన్న వ్యామోహాన్ని, విద్య చదువుకునేందుకు కాక "కొనేందుకు" దిగజారిన పరిస్థితులను గురించి పిల్లలపై వాటి ఒత్తిడుల గురించి, ఆ ప్రభావంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు స్త్రీల కథా వస్తువులయ్యాయి. స్త్రీలు కరోనా కాలంలో ఎదురయిన అనుభవాలను, ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిణామాలను కూడా తమ కథా వస్తువులుగా మార్చారు.

స్త్రీలు స్వతంత్ర్య వ్యక్తులుగా ఎదగకుండా, సాంఘిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులు, పురుషాధిక్యత అవరోధమవుతున్నాయి. పితృస్వామ్య వ్యవస్థ మారకపోవడం వలన స్త్రీలు ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేస్తున్నా, కుంటుంబం మరియు వివాహం అనే రెండు వ్యవవస్థల చేత నియంత్రించబడుతున్నారు. దాన్ని తెలియజేయడానికి రచనలను ఆధారంగా చేసుకున్నారు. ఇలా ఎందరో రచయిత్రులు సమస్యల పట్ల స్పందించి తమ అవగాహన మేరకు వాటికి సమాజంతో ఉన్న సంబంధాన్ని, సమాజాన్ని సామాజిక సమస్యల ప్రభావాన్ని చిత్రిస్తూ రచనలు చేసానన్న విషయం ఈ పరిశోధన వల్ల అర్థమవుతుంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. సాహిత్యాకాశంలో సగం – కాత్యాయనీ విద్మహే – స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, వరంగల్లు – ద్వితీయముద్రణ, డిసెంబరు, 2013..

2. తెలుగులో స్త్రీల సాహిత్యం(1900–1950) –కాత్యాయనీ కె., కిషన్ ప్రసాద్ జి. – యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ – తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ – 2009–11 – అముద్రితం.

3. దిద్దుబాటు – దిద్దుబాటుకు ముందు కథలు 92 – మూర్తి వివిన(సం॥) – తానా ప్రచురణలు (కథానిలయం, శ్రీకాకుళం సహకారంతో) – జనవరి, 2015.

4. తెలంగాణ తెలుగు కథ –వెంకటేశ్వర్లు పంతంగి (సం॥) – తెలుగు విభాగం, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్లు – ఫిబ్రవరి, 2011.

5. తెలుగు కథానిక 1980–2010 పరిశీలన – కాత్యాయనీ విద్మహే, విహారి, గుడిపాటి, వీరలక్ష్మీదేవి వాడ్రేవు, రామమోహన్‌రాయ్ కడియాల – డా॥ మాడభూషి రంగాచార్య స్మారకసంఘం, హైదరాబాదు – ఫిబ్రవరి, 2015.

6. జండర్ స్పృహ – కాత్యాయనీ విద్మహే(సం॥) – యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్లు – మార్చి, 2005.

7. తెలుగులో స్త్రీల సాహిత్యం –కాత్యాయనీ విద్మహే(సం॥) – యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్లు – ఆగస్టు, 2003.

8. తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రల పరిణామం, తెలుగు భాషా వికాసంలో కథ, కవిత, నవల – వ్యాస సంకలనం – 20వ తానా మహాసభల లిటరరీ కమిటీ ప్రచురణ, డెట్రాయిట్ – 2–4 జులై, సం॥ 2015.

* * *